క్లుప్తంగా

ఇసుక ర్యాంపుల పరిశీలన



వాడపల్లి ఇసుక ర్యాంపులో సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ దుర్గా ప్రసాద్

కొవ్వూరు: ఇసుక ర్యాంపుల పనితీరు, రవాణా వాహనాలకు వే బిల్లుల జారీ విధానాన్ని తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్ గురువారం సాయంత్రం పరిశీలించారు. వాడపల్లి, ఔరంగబాద్, కొవ్వూరు, దండగుండరేవు, ఎరినమ్మ ర్యాంపులను ఆయన పరిశీలించారు. ఇసుకకు అదనపు ధరలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరి ంచారు. వాహన దారులకు, బోట్స్‌మెన్స్ సొసైటీలకు ఆయన పలు సూచనలు చేశారు. అఖండ గోదావరి రివర్ బ్యాంక్ ఏఈ జి.మణికంఠరాజు, వీఆర్వో దుర్గారావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



చాగల్లులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ కేఎస్ఆర్‌వీ విజయకుమారి

చాగల్లు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ కేఎస్ఆర్‌వీ విజయకుమారి సూచించారు. చాగల్లులో కోడ్ నంబర్–70 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. పీడీ విజయకుమారి మాట్లాడుతూ ప్రీ స్కూలు విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. అంగన్‌వాడీలోని ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కొవ్వూరు సీడీపీఓ డి.మమ్మీ, సెక్టర్ సూపర్‌వైజర్ పీవీ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్త జి.సుశీల, సహాయకురాలు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి మహా కుంభాభిషేకం

తాళ్లపూడి: స్థానిక నవదుర్గ, శ్రీకచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మహా కుంభాభిషేక మహోత్సవాలు, శత చండీ యాగం నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు నీలి సూర్యానారాయణ, నీలి శ్రీనివాస్ తెలిపారు. శ్రీసిద్ధేశ్వర శ్రీ కార్తికేయ శివాచార్య గురువులు ఆధ్వర్యంలో అర్చకుడు అల్లూరి ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ ప్రదక్షిణ గోపూజ, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, మూల మంత్రహోమాలు, ప్రధాన కుంభావాహన చండీ పారాయణం, 22న 108 మంది దంపతులతో శత చండీ హోమం, దశ మహాదేవి, రాజశ్యామలా ప్రత్యంగిర, వారాహీభగళాముఖ హోమాలు, సాయంత్రం 6 గంటల నుంచి గరికపాటి నరసింహారావు ప్రవచనం, 23న అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ఆలయ శిఖరానికి కుంభాభిషేకం, దుర్గా మల్లేశ్వరస్వామి వారి శాంతి కల్యాణం, మధ్యాహ్నం మహాఅన్నసమారాధన, సాయంత్రం రథయాత్ర ఉంటుందని తెలిపారు.

సమిశ్రగూడెం ఎస్సైగా వీరబాబు



నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం ఎస్సైగా కె.వీరబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. రాజమహేంద్రవరం సీఐడీ విభాగంలో ఎస్సైగా పని చేసిన వీరబాబు ఇక్కడకు రాగా, సమిశ్రగూడెం ఎస్సైగా పని చేసిన రమేష్ వీఆర్‌కు వెళ్లారు. ఎస్సై వీరబాబును ఏఎస్సైలు ఆంజనేయులు, స్టేషన్ రైటర్ సోమరాజు, సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు కలిసి అభినందనలు తెలిపారు.

వాసవీక్లబ్ మాజీ అధ్యక్షుడి మృతి



వెంకటేశ్వరరావు

నిడదవోలు: స్థానిక వాసవీక్లబ్ మాజీ అధ్యక్షుడు కేదారిశెట్టి వెంకటేశ్వరరావు (71)అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. ఈయనకు భార్య బేబి పద్మావతి, నలుగురు కుమారులు ఉన్నారు. సేవా కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేసుకున్న వెంకటేశ్వరరావు రాయిపేట ఆర్యవైశ్య సేవా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, జేసీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశారు. రాయిపేట స్వగృహంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కుటుంబ సభ్యులను కలుసుకుని పరామర్శించారు. కుటుంబ పెద్దను కోల్పోవడం ఎంతో విచారకమని మంత్రి ధైర్యం చెప్పారు.

అవగాహన ర్యాలీ

దేవరపల్లి: దివ్యాంగులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తద్వారా మెరుగైన వైద్యం అందుతుందని మండల విద్యాశాఖ అధికారి ఎస్.తిరమలదాస్ అన్నారు. దుద్దుకూరు భవిత కేంద్రం వద్ద గురువారం దివ్యాంగులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి మంగళవారం భవిత కేంద్రం వద్ద నిర్వహించే ఫిజియోథెరపీని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్.అప్పారావు, దివ్యాంగుల ఉపాధ్యాయురాలు కొత్తపల్లి శ్రీదేవి దివ్యాంగులు పాల్గొన్నారు.

డ్రాగన్ పండు.. లాభాలు మెండు

- అభ్యుదయ రైతుల సాహసోపేత ప్రయోగం
- ఒక సారి పెట్టుబడి.. 25 ఏళ్లు రాబడి
- తొలకరి తర్వాత తయారు కానున్న డ్రాగన్ పండ్లు
- నల్లజర్ల మండలంలో మొదటిసారిగా సాగు



షెడ్‌నెట్‌లో విత్తనం పెంపకం



డ్రాగన్ ఫ్రూట్స్

నల్లజర్ల: అందరూ వెళ్లే దారిలో కాకుండా కొత్తగా చేయాలనుకున్న ఆ యువకులిద్దరూ డ్రాగన్ ఫ్రూట్ సాగుపై దృష్టి సారించారు. ఔషధ గుణాలు ఎక్కువగా ఉన్న పండ్లకు డిమాండ్ ఉండడంతో సంగారెడ్డి, గుంటూరు జిల్లా వేమవరం, రంగారెడ్డి జిల్లా అరుట్ల, పశ్చిమ గోదావరి జిల్లా బుట్టాయిగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లి అన్ని విషయాన్ను తెలుసుకొని సాగు చేపట్టారు. తైవాన్‌పింక్, సీఎం రెడ్, మెరాకిన్ రెడ్, తైవాన్ వైట్, అమెరికన్ బ్యూటీషన్, ఇశ్రాయిల్ గోల్డ్ విత్తనాలను తీసుకువచ్చి ప్లాస్టిక్ సంచులలో పెంచి వారికి ఉన్న 10 ఎకరాలలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న మూడున్నర ఎకరాలలో సాగు చేస్తున్నారు. మండలంలో మొట్టమొదటిగా డ్రాగన్ ఫ్రూట్ సాగుకు శ్రీకారం చుట్టారు నల్లజర్ల మండలం నబీపేట గ్రామానికి చెందిన అభ్యుదయ రైతులు యద్దనపూడి లక్ష్మణస్వామి, కానుబోయిన రాము. ఒకసారి నాటితే 9వ నెల నుంచి 25 ఏళ్ల పాటు డ్రాగన్ ఫ్రూట్ ఫలసాయాన్ని (ఫిబ్రవరి నుంచి నవంబరు వరకు) పొందవచ్చునని వీరు చెబుతున్నారు. దీని సాగుకు మెట్టప్రాంత భూములు అనుకూలంగా ఉంటాయని చెబుతున్నారు.

సాగు ఇలా..

ఆరుడుగుల ఎత్తు ఉండే సిమెంటు స్తంబాలను ఏర్పాటు చేసుకోవాలి. డ్రాగన్ ఫ్రూట్ మట్టల నుంచి సేకరించిన విత్తనాన్ని సిమెంట్ స్తంభం చుట్టూ నాటుకోవాలి. మూడు నెలల్లో స్తంభం చుట్టూ మొక్క విస్తరిస్తోంది. ఒక్కొక్కటిగా డ్రాగన్ ఫ్రూట్ ఫలసాయం వస్తుంది. విస్తారంగా ఫలసాయం పొందేందుకు నవంబరు–ఫిబ్రవరి మధ్య వచ్చే పూతను ఎప్పటికప్పుడు తొలగించడం ఉత్తమం. దీంతో ఫిబ్రవరి నుంచి అధికంగా ఫలసాయం వస్తుంది. తొమ్మిది నెలలో ఎకరానికి నాలుగు నుంచి పది టన్నుల దిగుబడి వస్తుంది. ఇప్పుడు ఎకరానికి ఏడాదికి 2 టన్నుల దిగుబడి వచ్చిందని అభ్యుదయ రైతులు లక్ష్మణస్వామి, రాము చెబుతున్నారు.

చీడపీడలు ఉండవు

ఈ పంటకు చీడపీడలు ఆశించే అవకాశం లేక పోవడంతో రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగించాల్సిన అవసరం లేదు. డ్రిప్ పద్ధతిలో రెండురోజులకు ఒకసారి తడి అందించి యాజమాన్య పద్ధతులు పాటించాలి. సేంద్రియ ఎరువులు వినియోగంతో పండు నాణ్యత పెరుగుతుంది. ఫ్రూట్ తొలగించిన రెబ్బల (మట్టలు)నుంచి సొంతంగా విత్తనం తయారు చేసుకోవచ్చు. దీని వల్ల అదనపు ఆదాయం పొందవచ్చని రైతులు చెబుతున్నారు.

ఔషధ గుణాలు ఎక్కువ..

పుచ్చకాయలాగానే తియ్యని రుచి కలిగిన డ్రాగన్ ఫ్రూట్‌లో ఔషధగుణాలున్నాయి. రక్తంలో చక్కెర నియంత్రణ, తెల్ల రక్త కణాల పెంపు, పేగుల్లో మంచి చేసే 400 రకాల బ్యాక్టీరియా వృద్ధి, మలబద్ధకం నివారణ, రోగ నిరోధక శక్తి పెంపు, జీర్ణాశయ రుగ్మతలు తొలగింపు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు

ఈ ఆసక్తితో ..



డ్రాగన్ ఫ్రూట్‌కు ఉన్న డిమాండ్‌తో సాగు చేయాలన్న ఆసక్తి పెరిగింది. ఐదు జిల్లాలు తిరిగి దాని గురించి అంతా తెలుసుకొని సాగు చేస్తున్నాను. మొదటి రెండు ఎకరాలలో వేశాను. మిగిలిన 8 ఎకరాలలో వివిధ పంటలు పూర్తయిన తర్వాత ఇదే సాగు చేస్తా. తొలకరి వర్షాల తర్వాత పూర్తి స్థాయి కాపు వస్తుంది.

– యద్దనపూడి లక్ష్మణస్వామి, రైతు, నబీపేట

ప్రయోగాత్మకంగా..



ఎప్పుడూ సాగు చేసే పంటలు కాకుండా కొత్తగా పంటలు వేయాలనుకున్నా. నాకున్న ఐదెకరాల భూమిలో తొలుత ఒక ఎకరంలో డ్రాగన్ ఫ్రూట్ పంటను వేశా. మొదటి సంవత్సరం 2ఎకరాలలో మూడున్నర టన్నుల దిగుబడి రాగ, రెండో ఏడాది ఎకరానికి 2 టన్నులు దిగుబడి వచ్చింది. టన్ను రూ.1.50 లక్షల వరకూ ఉంది. స్థానికంగా అమ్మగా మిగిలిన పంట పట్టణాలకు ఎగుమతి చేస్తున్నాను.

– కానుబోయిన రాము, రైతు, నబీపేట

అర ఎకరానికి రూ.1.84 లక్షల సబ్సిడీ



ఉపాధి హామీ పథకం ద్వారా డ్రాగన్ ఫ్రూట్ పెంపకానికి అర ఎకరానికి రూ.1.84 లక్షల సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోంది. రైతులను ప్రోత్సహిస్తున్నాం. జిల్లాలో మొట్టమొదటి సారిగా ఉపాధి హామీ పథకంలో డ్రాగన్ ఫ్రూట్ వేసింది ఇక్కడే. ఈ మొత్తం మొక్కల మెయింటెనెన్స్ కింద అందిస్తాం. అర ఎకరానికి 220 మొక్కలు వేయాల్సి ఉంటుంది. ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు.

– వెంకట్రావు, ఉపాధిహామీ ఏపీఓ, నల్లజర్ల

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయం



ఉండ్రాజవరంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆకెళ్ల, పాఠకులు



వాల్మీకికు నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్

ఉండ్రాజవరం: రామాయణ గ్రంథం సృష్టికర్త మహర్షి వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆకెళ్ల శ్రీనివాస రావు అన్నారు. ఉండ్రాజవరం శాఖ గ్రంథాలయంలో గురువారం శ్రీమహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రంథ పాలకుడు ఎంవి.కృష్ణారావు, వంగా చంద్రరావు, పి.శ్రీను, టి.వరప్రసాద్, కాయల వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: రామాయణ కర్త వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి రామాయణ మహాకావ్యాన్ని రాసి మహానుభావుడు అయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భారతి, ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, ఆర్ఐ కె.రామకృష్ణ, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. రాగోలపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాడు డి.దుర్గారావు ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి రాసిన రామాయణంలో 23 వేల శ్లోకాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జే రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొబ్బరి, ఆయిల్‌పామ్‌లో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

ఉద్యాన శాఖాధికారి బబిత



ఎర్రముక్కు,కొమ్ము పురుగుల నివారణను రైతులకు వివరిస్తున్న ఉద్యానశాఖాధికారి బబిత

నల్లజర్ల: కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలలో కొమ్ము, ఎర్రముక్క పురుగు నివారణకు రైతులు సత్వర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖాధికారి ఎం.బబిత రైతులకు సూచించారు. నల్లజర్లలో రైతు మేణ్ని శ్రీఫణి సందిప్ వ్యవసాయ క్షేత్రంలో ఈ పురుగుల నివారణపై గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పురుగులు ముదురు ఆకులపై వీ ఆకారంలో కత్తిరించినట్టుగా ఉండి మువ్వును పురుగు తొలచిన రంధ్రాలు కనపడతాయన్నారు. పురుగు ఆశించన తోటలలో దిగుబడులు తగ్గడమే కాకుండా కొన్నిచోట్ల చిన్న మొక్కలు చనిపోయే అవకాశం ఉందన్నారు. తొలుత మొవ్వ కుళ్లిపోయి ఆ భాగం నుంచి వచ్చే పులిసిన వాసనకు కొబ్బరిలో కాండం తొలిచే ఎర్రముక్కు పురుగు ఆశిస్తుందన్నారు. సేంద్రియ ఎరువు కుప్పలపైన, చనిపోయిన మొక్కల మొదళ్లలో గుడ్లు పెట్టి పురుగుల ఉధృతి పెరుగుతుందన్నారు. పడిపోయిన చెట్లను మొదళ్లతో సహా తొలగించి తగలబెట్టాలి. తోటలో వేసిన పశువుల పెంటను ప్రతి మూడునెలకొకసారి తిరగ వేసి కొమ్ము పురుగులను నిర్మూలించాలన్నారు. మూడు నెలలకు ఒక సారి మొవ్వ, ఆకువలయాలలో 150 గ్రాముల ఇసుకలో వేపపిండి 100 గ్రాములు వేసి చల్లాలన్నారు. లింగాకర్షక బుట్టలు ప్రతి రెండు ఎకరాలకు ఒక చోట ఏర్పాటు చేయాలన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే పెర్జార గుళికలు చిన్న పాలిథిన్ సంచులలో ఉంచి మొవ్వులో ఉంచాలన్నారు.

డిసెంబర్ నాటికి ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలి



అన్నదేవరపేటలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ, అధికారులు

తాళ్లపూడి: గృహ నిర్మాణ లబ్ధిదారులు డిసెంబర్ నెలాఖరు నాటికి ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని వారికి బిల్లులు కూడా చెల్లిస్తామని గృహ నిర్మాణ శాఖ ఈఈ సిర్రా చంద్రశేఖర్ అన్నారు. అన్నదేవరపేటలోని ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను గురువారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ లేవుట్‌లో 857 మంది ఇంటి పట్టాలను లబ్ధిదారులకు ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు 92 మంది మాత్రమే ఇంటి నిర్మాణాలను పూర్తి చేశారని, 136 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌లో, 31 గోడల దశలో, మరో 17 శ్లాబ్ దశకు చేరుకున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు పనులను మొదలు పెట్టని వారి వివరాలను సేకరిస్తున్నట్టు ఈఈ తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు డిసెంబర్ నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. వారికి పూర్తి స్థాయిలో బిల్లులు విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ డీఈ డి.శ్రీనివాస్ ఏఈశ్రీనివాస్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

నిడదవోలులో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం



బ్యాంక్ ఆఫ్ బరోడా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్ రితేష్ కుమార్

నిడదవోలు: రాజమండ్రి రీజియన్ పరిధిలో బ్యాంక్ ఆఫ్ బరోడా 51వ శాఖను నిడదవోలు పట్టణంలోని యర్నగూడెం రోడ్డులో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యమానికి బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ రితేష్‌కుమార్ హాజరై బరోడా బ్యాంకు శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ రితేష్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బ్యాంక్ ఆఫ్ బరోడా 51 శాఖల ద్వారా రూ.8 వేల కోట్లు బిజినెస్ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఎక్కువగా స్వయం సహాయక సంఘాలకు రుణాలు, బంగారం, వ్యవసాయం, కార్లు, ట్రాక్టర్ కొనుగోలు, పౌల్ట్రీ, రిటైల్, హౌసింగ్ రుణాలతో పాటు విద్య, వ్యక్తిగత అవసరాల కోసం పర్సనల్ రుణాలను అందిస్తున్నామన్నారు. వ్యాపారుల కోసం ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. గృహ, వ్యాపార పరిశ్రమలకు సౌర విద్యుత్ శక్తి ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకు ప్రత్యేక రుణాలను అందిస్తుందన్నారు. నిడదవోలు పరిసర ప్రాంత ప్రజలు బ్యాంకు ఆఫ్ బరోడాలో అన్ని రకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఎంఎస్ సుధాకర్, రాజమండ్రి ప్రాంతీయ కార్యాలయ అధికారి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్. రవీంద్రనాథ్ ఠాగూర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఏవీ భాస్కరం, నిడదవోలు శాఖ మేనేజర్ కె. ప్రియ బిందు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన



బ్రాహ్మణగూడెంలోని అన్నదానంలో పాల్గొన్న భక్తులు

చాగల్లు: దేవీనవరాత్ర ఉత్సవాల ముగింపులో భాగంగా బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం సాయంత్రం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణగూడెం, గరప్పాడు, ఎస్ ముప్పవరం, దారవరం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



అట్లపాడులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు రూరల్: ఉపాధి హామీ నిధులతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పల్లె పండుగ– పంచాయతీ వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా అట్లపాడు గ్రామంలో రూ.18.41 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి దుర్గేష్ గురువారం శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. సర్పంచ్ దాయం రత్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీడీఓ డి.లక్ష్మినారాయణ, తహసీల్దార్ నాగరాజునాయక్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఉండ్రాజవరం: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలో కాల్దారి, సత్యవాడ, చిలకపాడు, మోర్త, దమ్మెన్ను, తాడిపర్రు, వెలగదుర్రు గ్రామాల్లో రూ.కోటి 16లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ముందుగా కాల్దారి గ్రామంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పెరవలి మండలంలో..

పెరవలి: మండలంలోని అజ్జరం, కాకరపర్రు గ్రామాల్లో రూ.11 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు మంత్రి కందుల దుర్గేష్ శంకుస్థాపన చేశారు.ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో విక్రయాలు ప్రారంభం

కొవ్వూరు: నియోజకవర్గంలో 16 ప్రైవేటు మద్యం దుకాణాలుండగా వీటిలో గురువారం వరకూ 14 దుకాణాల్లో అమ్మకాలు ప్రారంభమైనట్టు ఎక్సైజ్ సీఐ కె.సత్యనారాయణ తెలిపారు. కుమారదేవం, అన్నదేవరపేట గ్రామాల్లో దుకాణాల ఏర్పాటుకు సరైన స్థలం లేకపోవడంతో ప్రారంభించలేదన్నారు. ఈనెల 14న వేలంలో దుకాణాలు దక్కించుకున్నప్పటికీ 15న డీడీలు చెల్లింపులు, 16వ తేదీ నుంచి మద్యం అమ్మకాలు ప్రారంభించాల్సి ఉంది. తొలి రోజు ఆరు దుకాణాలు ప్రారంభం కాగా గురువారం ఎనిమిది చోట్ల అమ్మకాలు మొదలు పెట్టారు. కొవ్వూరు పట్టణంలో స్టాండ్ సెంటర్, పెట్రోలు బంక్‌లకు ఎదురుగా ఉండే ఖాళీ స్థలంలో ఇప్పటి వరకు కొనసాగిన ప్రభుత్వ దుకాణాల్లోనే ప్రైవేటు షాపులు ఏర్పాటు చేశారు. మెయిన్ రోడ్డులో దుకాణం పెట్టారు. సీతంపేట, చాగల్లు, బ్రాహ్మణగూడెం, తాళ్లపూడిలో వాడపల్లి గ్రామాల్లో ప్రభుత్వ దుకాణాలు నడిచిన చోటే ఏర్పాటు చేశారు. కొత్తగా చిక్కాల, మార్కొండపాడు ఏర్పాటు చేశారు. తాళ్లపూడి మండలంలో పెద్దేవం, ప్రక్కిలంకలలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు.

నిడదవోలు: మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు గురువారం నూతన దుకాణాలను ప్రారభించారు. నియోజకవర్గంలో మొత్తం 19 షాపులకు టెండర్లలో సిండికేట్ వ్యాపారులు మద్యం దుకాణాలను దక్కించుకున్నారు. వీటిలో గురువారం 16 దుకాణాలను వ్యాపారులు ప్రారంభించారు. నియోజవర్గంలో మంజూరు చేసిన 19 దుకాణాలలో డిపాజిట్ చేయని కారణంగా ఇంకా మూడు దుకాణాలు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం 16 దుకాణాలకు అధికారికంగా ఆమోదం రావడంతో సరకు కోసం డిపోలు వద్ద రద్దీ పెరిగింది. రెండు రోజుల్లో ఇండియన్ ప్రకారం సరకు రానుంది. ప్రస్తుతం ఒక్కో మద్యం షాపునకు 100 కేసుల లిక్కర్, 50 కేసుల బీర్లను డిపో వద్ద నుంచి సరఫరా చేశారు. పట్టణంలో నాలుగు మద్యం దుకాణాలు ప్రారంభమవడంతో మద్యం ప్రియులు షాపుల వద్ద బారులు తీరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు: పట్టణంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నిడదవోలు విద్యుత్ ఈఈ ఎస్. నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతులు, ట్రీ కటింగ్ పనులు కోసం మెయిన్‌రోడ్, గణేష్ చౌక్ సెంటర్, గణపతి సెంటర్, యర్నగూడెం రోడ్, శాంతినగర్, వైఎస్సార్ నగర్, గాంధీనగర్, రాయిపేట, ఇందిరానగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలో కాటకోటేశ్వరం, పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో కాటకోటేశ్వరం, పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని కాటకోటేశ్వరం, పురుషోత్తపల్లి, మద్దూరు, విజ్జేశ్వరం, గోపవరం, డి.ముప్పవరం, జీడిగుంట, కలవచర్ల, సమిశ్రగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

ఉండ్రాజవరం: పాలంగి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు.

మూడు రోజులపాటు..

పెరవలి: కానూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు.

కొవ్వూరు: పట్టణంలో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నిడదవోలు ఈఈ ఎస్.అప్పారావు తెలిపారు. బాపూజీనగర్, లాయర్స్ కాలనీ, చిన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వీధుల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రకటించారు.

రీసర్వేపై నేటి నుంచి గ్రామ సభలు

కొవ్వూరు: ఈనెల 18వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకూ మండల వ్యాప్తంగా రీసర్వే అభ్యంతరాలు, సమస్యలు తెలుసుకునేందుకు గ్రామసభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్ తెలిపారు. మండలంలో నందమూరు, కొవ్వూరు, దొమ్మేరు గ్రామాల్లో మినహా అన్నీ గ్రామాల్లోను రీసర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. రీసర్వే పూర్తయిన చోట్ల ఏవైనా అభ్యంతరాలు, సమస్యలు ఉంటే రాత పూర్వకంగా తెలియ జేయవచ్చునన్నారు. ప్రతి గ్రామంలోను ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలతో కూడిన బృందంతో గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. శుక్రవారం ఉదయం చిడిపి గ్రామంలోను, 19న ఆరికిరేవుల, 21న పెనకనమెట్ట, 23న తొగుమ్మి, 24న చిగురుల్లాంక(డీ పాలేటేటెడ్ విలేజ్) రెవెన్యూ గ్రామంలో సభలు జరగుతున్నాయన్నారు. 25, 26న కుమారదేవం, 28న మద్దూరులంక, 29న ధర్మవరం, నవంబర్ 4, 5 తేదీల్లో ఐ.పంగిడి, 6, 7న దేచెర్ల, 11, 12 తేదీల్లో వేములూరు, 13, 14న వాడపల్లి, 15, 16న మద్దూరు గ్రామంలోను గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

తాడిపర్రులో ఉద్రిక్తత



పాపన్న గౌడ్ విగ్రహానికి ముసుగు తొలగించిన మహిళలు

ఉండ్రాజవరం: తాడిపర్రు గ్రామంలో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహానికి ఉన్న ముసుగును ఒక సామాజిక వర్గానికి చెందిన మహిళలు బుధవారం అర్ధరాత్రి తొలగించింది. దాంతో గ్రామంలో ఆ రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. గ్రామంలో ఒక సామాజిక వర్గం సుమారు రెండేళ్ల క్రితం సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహవిష్కరణకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఆ విగ్రహం ఏర్పాటుకు మరో సామాజిక వర్గం వ్యతిరేకించడంతో నాటి నుంచి గ్రామంలో వివాదం కొనసాగుతోంది. దాంతో పోలీసులు 144 సెక్షన్‌తో పాటు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నారు. బుధవారం రాత్రి ఒక సామాజిక వర్గం మహిళలు పాపన్న గౌడ్ విగ్రహానికి వేసి ఉన్న ముసుగును తొలగించడంతో మళ్లీ ఆ రెండు వర్గాల మధ్య వివాదం రేగింది. సమాచారం తెలుసుకున్న ఎస్సై గుబ్బల శ్రీనివాసు వెంటనే పోలీస్ బలగాలను మోహరించారు. ఆర్డీవో డాక్టర్ రాణి సుస్మిత, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ గ్రామానికి చేరుకుని గురువారం సాయంత్రం ఇరువర్గాలతో చర్చలు జరిపారు. కొంతమంది సభ్యులతో పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం పీస్ కమిటీ సభ్యులతో, అధికారులతో పాటు గ్రామ సర్పంచ్ సమక్షంలో తీర్మానం రాయించారు. ముసుగు తీసిన మహిళను పట్టుకున్నారు. తర్వాత ఆర్డీవో వారికి సర్ది చెప్పి పాపన్న గౌడ్ విగ్రహం చుట్టూ గుడ్డను చుట్టి సమస్యను పరిష్కరించారు.